క్లుప్తంగా

నూతన నియామకం

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గుండారం గ్రామానికి చెందిన బడపట్ల తిరుపతిని బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమిస్తున్నట్లు మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, మండల పార్టీ అధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి, ఎలుక దేవయ్య తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఫలితం దక్కేనా?



విరాళంగా నోట్లను సేకరిస్తున్న బీఎస్పీ అభ్యర్థి నిశాని రామచంద్రం

బెజ్జంకి(సిద్దిపేట): ఓటర్లను చైతన్య పరిచేందుకు బీఎస్పీ మానకొండూర్ అభ్యర్థి, ఆపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిశాని రామచంద్రం చేసిన ప్రయత్నం ఏమేరకు ఫలితాన్నిస్తుందో రేపటి ఫలితాలు నిర్ణయించనున్నాయి. మానకొండూర్ నియోజకవర్గంలోని ఆరు మండలాలలో పర్యటించిన ఆయన పలుసభల్లో మాట్లాడారు. పేదల బతుకులు మారడానికి ఓటుతో పాటు నోటు అందించి బీఎస్పీని ఆదరించాలని కోరారు. ఇలా సేకరించిన 1200 నోట్లు లెక్కించగా రూ.56 వేలు వచ్చినట్లు తెలిపారు. పార్టీ వ్యవస్థాపకుడు కాన్షీరాం స్ఫూర్తితోనే ఇలా నియోజకవర్గ ప్రజల నుంచి సేకరించి వారిని చైతన్యపరిచినట్లు రామచంద్రం తెలిపారు. ప్రధాన పార్టీలు ప్రలోభాలకు గురిచేస్తే తాము నోట్లు సేకరించామని పేర్కొనడం విశేషం.

రేపు సదానందాశ్రమ వార్షికోత్సవం

మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డి, లక్ష్మీనగర్, ఆరెపల్లి గ్రామాల శివారులోని శ్రీ సదానందాశ్రమ 40వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆశ్రమ శిష్యబృందం శనివారం తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ధ్వజారోహణం, సామూహిక అభిషేకాలు, పుష్పార్చన, బిల్వపత్ర పూజలు నిర్వహిస్తామని తెలిపారు. వార్షికోత్సవంలో మాధవానంద సరస్వతీ స్వామి భక్తులకు అనుగ్రహ భాషణం చేయనున్నట్లు తెలిపారు.

నడిరోడ్డుపై గుంత



గుంత వద్ద పెట్టిన కొమ్మలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని మనంతయపల్లితండా పాఠశాల వద్ద మెదక్-జోగిపేట ప్రధాన రహదారిపై గుంత పడింది. అధికారులు పట్టించుకోవడం లేదని తండావాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తండాకు నీటిని సరఫరా చేసే పైప్‌లైన్ లీకేజీ కావడంతో రోడ్డుపై గుంత ఏర్పడిందని, దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వాహనదారులకు ప్రమాదం జరిగే అవకాశం ఉన్నా గ్రామ పంచాయతీ, ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గుంత వద్ద కొమ్మలు పెట్టి గుంత కనిపించేలా చేశారు. అధికారులు స్పందించి సమస్య తీర్చాలని కోరారు.

రోడ్డు పనులు ప్రారంభం

శివ్వంపేట(నర్సాపూర్): రోడ్డు మరమ్మతు లు ప్రారంభమైయ్యాయి. మండలంలోని పోతులబోగూడ నుంచి ఉసిరికపల్లి, చెండి నుంచి అనంతారం చౌరస్తా వరకు రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. మరమ్మతులకు నిధులు మంజూరు కావడంతో అధికారులు పనులు ప్రారంభించారు. సింగిల్‌రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చేందుకు ప్రభుత్వం రూ.30 కోట్లు మంజూరు చేసింది. పెరిగిన వాహనాల రద్దీకి అనుగుణంగా డబుల్ రోడ్డు చేసేందుకు చర్యలు చేపట్టారు. రోడ్డు విస్తరణ పూర్తయితే హైదరాబాద్ నగరానికి వెళ్లేందుకు దూరభారం తగ్గడంతో పాటు పలు గ్రామాల ప్రజలకు రవాణా వ్యవస్థ మెరుగుపడనుంది. చాలా ఏళ్ల క్రితం నుంచి పాడైపోయిన రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం లభించడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ప్రారంభమైన రోడ్డు విస్తరణ పనులు

హద్దులు మార్చి రిజిస్ట్రేషన్లు !

- రిజిస్ట్రేషన్ ఒకచోట, హద్దులు మరోచోట
- ఐఓసీ ముందే ప్రభుత్వ భూమిలో పాగా
- టీఎన్‌జీఓ భవన శిలాఫలకం ధ్వంసం
- అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం

హుస్నాబాద్‌రూరల్:


హుస్నాబాద్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో హద్దులు మార్చి రిజిస్ట్రేషన్లు చేయడంతో భూ వ్యాపారులు రూ.లక్షల విలువైన ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నారు. పట్టా భూముల రికార్డులను చూపించి దళారులు ప్రభుత్వ భూములకు హద్దులు వేసి నివేశ స్థలాలను విక్రయించి లక్షలు దండుకుంటున్నా సంబంధిత అధికారులు స్పందించడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రైవేటు వ్యక్తుల సహకారంతో అధికారులు కమీషన్లు తీసుకొని వారికి కావల్సిన రికార్డులను మార్చి వేస్తున్నారని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఐఓసీ భవనం ముందు టీఎన్‌జీఓ భవన నిర్మాణానికి సర్వే నంబరు 124లోని ప్రభుత్వ భూమిలో మంత్రితో శిలాఫలకం వేయించి శంకుస్థాపన చేశారు. అధికారులందరూ ఎన్నికల విధుల్లో నిమగ్నం కావడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు గుట్టుచప్పుడు కాకుండా రాత్రి సమయంలో దానిని కూల్చివేశారు. శిలాఫలకం కూల్చివేసిన సంఘటనపై సంఘం నాయకులు మంత్రి హరీశ్‌రావు, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటి వరకు చర్యలు తీసుకోకపోవడంతో ఉద్యోగులు విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల భవనానికి సంబంధించిన శిలాఫలకానికే రక్షణ లేకపోతే సామాన్యుల భూములకు ఎక్కడ రక్షణ ఉంటుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ భూమిని ఆక్రమించడం ఏమిటి?

హుస్నాబాద్ మండలం తోటపల్లి శివారులోని సర్వే నంబరు 124లో ప్రభుత్వ పాలిటెక్నిక్‌కు 10.10 ఎకరాలు, ఐఓసీ భవనానికి 2 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించారు. ఐఓసీ భవనం ముందు స్థలంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు భూ యాజమాని నుంచి కొనుగోలు చేసిన స్థలాన్ని ప్లాట్లు చేసి విక్రయించారు. ఇక్కడ సర్వేయర్ పెట్టిన హద్దురాళ్లను మార్చిన వ్యాపారులు రిజిస్ట్రేషన్ 152లో చేసి 124లోని ప్రభుత్వ భూమిలో హద్దులు చూపించి ప్లాట్లు విక్రయించడంతో ప్లాట్లు కొనుగోలు చేసి వారు ఐఓసీ రోడ్డుకు ప్రభుత్వ భూమిలోనే హద్దురాళ్లను ఏర్పాటు చేసుకున్నారు. సర్వే నంబర్ 124లో టీఎన్‌జీఓ భవన నిర్మాణానికి ఖాళీ స్థలం ఉందని రెవెన్యూ అధికారుల సూచన మేరకు ఉద్యోగులు మంత్రితో శిలాఫలకం ఆవిష్కరింపజేసి శంకుస్థాపన చేశారు. అధికారులు లేని సమయంలో భూ వ్యాపారులు ఆ శిలాఫలకాన్ని ధ్వంసం చేసి ప్రభుత్వ భూమిలో హద్దురాళ్లు ఏర్పాటు చేశారు. నాలుగు ప్లాట్లు ఆక్రమించడంతో వారికి రూ.50 లక్షల ఆదాయం సమకూరిందని చర్చ జరుగుతోంది. శిలాఫలకం ధ్వంసం చేసిన విషయంపై పోలీసులకు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని ఉద్యోగులు మండిపడుతున్నారు.



ప్రభుత్వ భూమిలోని హద్దురాళ్లు, శిలాఫలకం ధ్వంసం చేసిన స్థలం



సర్వే నంబరు 124లో ప్రభుత్వ భూమి రంగుల్లోని స్థలం

సర్వేచేసి చర్యలు తీసుకుంటాం

ప్రభుత్వ భూమిలోని శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన విషయంపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం. ఎలక్షన్ పని ఒత్తిడి కారణంగా చర్యలు తీసుకోలేదు. ప్రభుత్వ భూమిని సర్వే చేయించి హద్దు రాళ్లు ఏర్పాటు చేస్తాం. గుంట భూమి కబ్జా కాకుండా రక్షిస్తాం.

– రవీందర్‌రెడ్డి, తహసీల్దారు, హుస్నాబాద్

బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ సాధించాలని పూజలు



కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో బీఆర్‌ఎస్వీ నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీఆర్‌ఎస్ పార్టీ విజయం సాధించి, కేసీఆర్ మూడోసారి సీఎం కావాలని, మంత్రి హరీశ్‌రావు లక్షన్నర మెజార్టీ సాధించాలని బీఆర్‌ఎస్వీ నాయకులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు బీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు యాదగిరి శనివారం తెలిపారు. జగిత్యాల జిల్లా పరిధిలోని ధర్మపురి శ్రీలక్ష్మీనరసింహస్వామి, కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి ఆలయాల్లో పూజలు చేశామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ నియోజక వర్గ సమన్వయ కర్త నార్లపూరం రామ్మోహన్, రాచకొండ భిక్షపతి, పట్టణ సమన్వయ కర్త ఇరుగంటి రమేష్, గోవిందారం రవి, బండి శ్రీకాంత్, ఆకుల సతీష్, కోడెల నరేష్ యాదవ్, శేఖర్, అప్పల శేఖర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కొండపోచమ్మ ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం

జగదేవ్‌పూర్(గజ్వేల్): కొండపోచమ్మ ఆలయ 22వ వార్షికోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. అమ్మవారిని పూలతో అలంకరించారు. గణపతి పూజ, పుణ్యాహవాచనం, అఖండ దీపస్థాపన, అగ్ని ప్రతిష్ఠ, అభిషేకం, హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మూడు రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయన్నారు. ఈఓ మోహన్‌రెడ్డి, సర్పంచ్ రజిత, ఎంపీటీసీ కావ్యదర్గయ్య, సిబ్బంది రమేష్, కనకయ్య, వెంకట్‌రెడ్డి, సుధాకర్, హరి, చిన్నా, చందు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



పూజ చేస్తున్న అర్చకులు

ఐకమత్యంతోనే గ్రామం అభివృద్ధి



మాట్లాడుతున్న సదాశివరెడ్డి

నంగునూరు(సిద్దిపేట): అందరూ ఐకమత్యంగా ఉంటే గ్రామం అభివృద్ధి చెందడంతో పాటు దాతలు సహాయం చేసేందుకు ముందుకువస్తారని ఎల్లంకి ఇంజనీరింగ్ సంస్థల చైర్మన్ సదాశివరెడ్డి అన్నారు. పాలమాకుల గ్రామానికి చెందిన ఎల్లంకి మాధవరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారులు సదాశివరెడ్డి, సాంబశివరెడ్డి, దయాకర్‌రెడ్డి శనివారం రూ.10 లక్షల విలువ చేసే వైకుంఠ రథం, బాడీ ఫ్రీజర్ అందజేశారు. అనంతరం సదాశివరెడ్డి మాట్లాడుతూ పుట్టిన ఊరికి సహాయం చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సారయ్య, సర్పంచ్ కుమారస్వామి, ఎల్లంకి రవీందర్‌రెడ్డి, ఉప సర్పంచ్ ఓజాలు, పరమేశ్వర్, వేణుచక్రవర్తి, ఐలయ్య, శ్రీనివాస్, నరేశ్, లక్ష్మణ్, అశోక్, రవి, మల్లేశం, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయంపాలన



స్వయం పాలనలో పాల్గొన్న విద్యార్థులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని వివేకానంద పాఠశాలలో శనివారం ఘనంగా స్వయంపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయుగామారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. డీఈఓగా చరణ్, కరస్పాండెంట్‌గా చందన, ప్రిన్సిపాల్‌గా ధనశ్రీ, మిగతా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ భాస్కర్ రెడ్డి, కరెస్పాండెంట్ లిఖిత పర్యవేక్షించారు. స్వయం పాలన నిర్వహించిన విద్యార్థులను ఉపాధ్యాయులు వాణిశ్రీ, రత్నమాల, జరీనా, శిరీష, శ్రీవాణి, మనూష, అరుణ, భారతి అభినందించారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



రాంచంద్రం కుటుంబాన్ని పరామర్శిస్తున్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట- భూంపల్లి మండల కేంద్రంలో ఇటీవల విద్యుదాఘాతంతో రైతు కుమ్మరి రాంచంద్రం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మృతుడి కుటుంబాన్ని శనివారం పరామర్శించి కొంత ఆర్థిక సాయం చేశారు. విద్యుత్ అధికారులతో మాట్లాడి బాధితుడి కుటుంబానికి ప్రభుత్వ పరంగా సాయం అందేలా చూస్తానన్నారు. పరామర్శించిన వారిలో ఉప సర్పంచ్ వడ్ల ప్రభాకర్, వార్డు సభ్యులు చంద్రం, రాజు, బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఐతం శ్రీనివాస్, నాయకుడు ఉల్లెంగెల నరేష్ తదితరులు ఉన్నారు.

అయ్యప్ప స్వాముల పాదయాత్ర

పెద్దశంకరంపేట(మెదక్): కేరళ రాష్ట్రంలోని శబరిమల అయ్యప్ప స్వామి సన్నిధానానికి శనివారం బాన్సువాడకు చెందిన వినయ్‌కుమార్ గురుస్వామి ఆధ్వర్యంలో స్వాములు పాదయాత్రగా తరలివెళ్లారు. బాన్సువాడ, ఎల్లారెడ్డి, జుక్కల్, నారాయణఖేడ్, పెద్దశంకరంపేటకు చెందిన అయ్యప్ప స్వాములు పాదయాత్ర చేపట్టారు. పెద్దశంకరంపేటకు చెందిన గురుస్వామి రామచంద్రాచారి, బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు మురళీ వారికి ఘనస్వాగతం పలికి భిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ జంగం శ్రీనివాస్, ఎంపీటీసీ వీణసుభాష్‌గౌడ్, గురుస్వాములు రాములు, రామ్మూర్తి, శ్రీహరి, సాయిరాం, పరంధాం, విఠల్ రావు తదితరులు పాల్గొన్నారు.



శబరిమలకు వెళ్తున్న అయ్యప్ప స్వాములు

చెట్ల నరికివేతపై చర్యలు తీసుకోండి

హుస్నాబాద్: భూ యజమాని అనుమతి లేకుండా చెట్లను తొలగిస్తున్నారని మామిడి తోట యాజమాని ఎనగందుల లక్ష్మీనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశాడు. హుస్నాబాద్ పట్టణ శివారులోని పొట్లపల్లి రోడ్‌లో ఉన్న మామిడి తోటలో అనుమతి లేకుండా ఇప్పటికే రెండు ట్రాన్స్‌ఫార్మర్లు బిగించారని, మళ్లీ మరొకటి ఏర్పాటుచేసే ప్రయత్నం చేస్తున్నారని తెలిపాడు. ట్రాన్స్‌ఫార్మర్లకు మామిడి చెట్ల కొమ్మలకు తగిలే ప్రమాదం ఉందంటూ ఏపుగా పెరిగిన చెట్లను నరికి వేస్తున్నారని చెప్పాడు. ప్రభుత్వం మామిడి తోటలు, పామాయిల్ సాగు వేసుకునేందుకు సబ్సిడీ ఇస్తుంటే మరోవైపు విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు పేరుతో పంటలకు నష్టం కలిగిస్తున్నారని ఆరోపించాడు.



మామిడి తోటలో ఏర్పాటుచేస్తున్న ట్రాన్స్‌ఫార్మర్

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ



మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు పరీక్షా ప్యాడ్‌లు అందజేస్తున్న ట్రస్ట్ నిర్వాహకుడు జగదీశ్వర్

హుస్నాబాద్: హుజూరాబాద్‌కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్షా ప్యాడ్‌లు పంపిణీ చేసినట్లు శనివారం ట్రస్ట్ నిర్వాహకుడు గంగిశెట్టి జగదీశ్వర్ తెలిపారు. పట్టణంలోని మోడల్ స్కూల్‌లో 97, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో 40, మహాత్మా జ్యోతి పూలే బాలికల రెసిడెన్సియల్ పాఠశాలలో 96 పరీక్షా ప్యాడ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్స్ అన్నపూర్ణ, మమత, శైలజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సర్పంచ్‌కు గాయాలు

శివ్వంపేట(నర్సాపూర్): రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన సంఘటన శనివారం చోటు చేసుకుంది. క్షతగాత్రుల కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని చిన్నగొట్టిముక్కుల సర్పంచ్ బాలమణి, భర్త నరేందర్, పిల్లలు గోమారం గ్రామానికి బైక్‌పై వస్తోంది. రోడ్డుపై ధాన్యం ఆరబోయడంతో వాహనం అదుపుతప్పి ఎదురుగా వస్తున్న మరోబైక్ వీరిని ఢీకొంది. ఈ సంఘటనలో సర్పంచ్‌తోపాటు ఆమె భర్త, కుమారుడికి గాయాలయ్యాయి. గుర్తించిన స్థానికులు చికిత్స నిమిత్తం వెంటనే వారిని నర్సాపూర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన సర్పంచ్‌ను ఎంపీపీ హరికృష్ణ పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

సెల్‌ఫోన్ల నిషేధం

- సీపీ ఎన్.శ్వేత



పోలీసు అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేస్తున్న సీపీ శ్వేత

సిద్దిపేటకమాన్: ఆదివారం ఎన్నికల కౌంటింగ్ జరగనున్న ఇందూర్ ఇంజనీరింగ్ కళాశాల సెంటర్ వద్ద మూడంచెల పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీపీ ఎన్.శ్వేత తెలిపారు. ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా పోలీసు కన్వెన్షన్ సెంటర్‌లో అధికారులు, సిబ్బందితో శనివారం సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. కేంద్రం లోపల విధులు నిర్వహించే పోలీసు సిబ్బంది సెల్‌ఫోన్లు తీసుకెళ్లకూడదన్నారు. కౌంటింగ్ కేంద్రం లోపలికి వచ్చే వారి వద్ద అగ్గిపెట్టెలు, సిగరెట్లు, ఇతర విధ్వంసకర వస్తువులు ఉన్న వారికి అనుమతి లేదన్నారు.

పార్కింగ్ ప్రదేశాలు

ఏ- బ్లాక్ దుబ్బాక కౌంటింగ్ సెంటర్: దుబ్బాక నియోజకవర్గం నుంచి వచ్చే ఏజెంట్లు కన్వెన్షన్ హాల్ రోడ్డు నుంచి కళాశాల గెస్ట్‌హౌస్ పక్కన ఉన్న ఖాళీ స్థలంలో తమ వాహనాలను పార్క్ చేసి లోనికి వెళ్లాలని సూచించారు.

సీ-బ్లాక్ హుస్నాబాద్ కౌంటింగ్ సెంటర్: హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి వచ్చే కౌంటింగ్ ఏజెంట్లు హనుమాన్ టెంపుల్ పోలీసు కన్వెన్షన్ హాల్ పక్కన ఉన్న టీహెచ్‌ఆర్ నగర్ రోడ్డు నుంచి కళాశాలలో వాహనాలను పార్క్ చేసుకోవాలన్నారు.

ఈ -బ్లాక్ గజ్వేల్ కౌంటింగ్ సెంటర్: గజ్వేల్ నియోజకవర్గం నుంచి వచ్చే కౌంటింగ్ ఏజెంట్లు పొన్నాల గ్రామంలో నుంచి వచ్చి దుర్గామాత దేవాలయం వెనుక ఉన్న ఖాళీ ప్రదేశంలో వాహనాలు పార్క్ చేసి కేంద్రం లోపలికి వెళ్లాలి.

డీ- బ్లాక్ సిద్దిపేట కౌంటింగ్ సెంటర్ : సిద్దిపేట నియోజకవర్గం నుంచి వచ్చే కౌంటింగ్ ఏజెంట్లు కన్వెన్షన్ హాల్, టీహెచ్‌ఆర్ రోడ్డు నుంచి వెళ్లి ఇందూర్ కళాశాల క్యాంటీన్ వద్ద ఏర్పాటు చేసిన ఖాళీ స్థలంలో వాహనాలను పార్క్ చేయాలి.

◆ మీడియా ప్రతినిధులు హనుమాన్ టెంపుల్, పోలీసు కన్వెన్షన్ హాల్ రోడ్డు నుంచి కళాశాల క్యాంటీన్ వద్ద నుంచి లోనికి వెళ్లి ఎడమ వైపు వాహనాలను పార్క్ చేసి మీడియా పాయింట్‌కు చేరుకోవాలన్నారు. పోలింగ్ ఏజెంట్లు, అధికారులు తప్పనిసరిగా ఆర్‌ఓ జారీ చేసిన గుర్తింపు కార్డులు తీసుకుని రావాలని సీపీ సూచించారు.

ట్రాఫిక్ డైవర్షన్

◆ పొన్నాల నుంచి సిద్దిపేటకు వెళ్లే వాహనదారులు పొన్నాల గ్రామం నుంచి, రాజీవ్ రహదారి పొన్నాల దాబాల నుంచి వెళ్లాలి.

◆ సిద్దిపేట నుంచి పొన్నాల గ్రామం వైపు వెళ్లే వాహనదారులు పొన్నాల దాబాలు, రాజీవ్ రహదారి రోడ్డు నుంచి వెళ్లాలి. అదేవిధంగా కౌంటింగ్ సెంటర్‌తో పాటు జిల్లా వ్యాప్తంగా ఆదివారం 144 సెక్షన్ నిబంధనలు అమల్లో ఉంటుందన్నారు. సమావేశంలో అడిషనల్ డీసీపీలు మల్లారెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఏసీపీలు సురేందర్‌రెడ్డి, సీఐలు కృష్ణారెడ్డి, రవికుమార్, భానుప్రకాష్, చీరాలు, ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వేగంగా అండర్‌గ్రౌండ్ బ్రిడ్జి పనులు

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలంలోని జప్తిశివనూర్ గ్రామ బస్టాప్ వద్ద జాతీయ రహదారిపై అండర్ గ్రౌండ్ బ్రిడ్జి పనులు వేగవంతం చేశారు. రెండేళ్ల క్రితం బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. జాతీయ రహదారిపై రాకపోకలు సాగించే జప్తిశివనూర్ గ్రామస్తులు గ్రామంలోకి వచ్చేందుకు సర్వీస్ రోడ్ లేకపోవడంతో అనేక మంది ప్రమాదాలకు గురయ్యారు. దీంతో గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గ్రామస్తుల విజ్ఞప్తితో నిధులు మంజూరు చేసిన అధికారులు పనులు ప్రారంభించారు. అధికారులు పనులను మరింత వేగవంతం చేసి అండర్‌గ్రౌడ్ బ్రిడ్జి నిర్మాణం పూర్తిచేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



కొనసాగుతున్న బ్రిడ్జి పనులు

వేతనాలు చెల్లించాలి

చేగుంట(తూప్రాన్): పరిశ్రమ అక్రమ లాకౌవుట్‌ను ఎత్తేసి కార్మికులకు వేతనాలు చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మక్కరాజీపేట స్రాంటియం పెరిటిన్ పరిశ్రమ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం మాట్లాడుతూ.. సదరు పరిశ్రమను మక్కరాజీపేటలోని ఓ రైస్ మిల్లులో అక్రమంగా నడిపించి నాలుగు రోజుల క్రితం మూసివేసినట్లు తెలిపారు. కార్మికుల వేతనాల విషయంలో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ కార్యాలయంలో ఫిర్యాదు చేయగా, విచారణకు హాజరు కావాల్సిన పరిశ్రమ యజమానులు స్పందించడం లేదన్నారు. సదరు పరిశ్రమ యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి భాస్కర్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.